సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 13 । డిసెంబర్ । 2023



కాసుల గండం

లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలను వాడుకలోకి తెద్దామన్న ఆలోచన అధికారులు, నాయకులకు రావడం లేదు. 8లో▸



'వీర్లపల్లి' విజయం మాదే..

37 ఏళ్ల క్రితం షాద్‌నగర్ ఎమ్మెల్యేతో కలిసి చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఆయన్ను కలిసి సన్మానించారు. 8లో▸



పేరుకే నిర్మాణం..

విద్యార్థులతో పాటు యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు చేపట్టిన క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు గ్రహణం పట్టింది. 8లో▸

గ్రేటర్‌కు నయా బాస్‌లు

- మూడు పోలీస్ కమిషనరేట్లకు కొత్త బాస్‌లు
- సిటీకి 60వ కొత్వాల్‌గా కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి
- సైబరాబాద్‌కు తొమ్మిదో బాస్‌గా అవినాష్ మహంతి
- రాచకొండకు మూడో కమిషనర్‌గా సుధీర్‌బాబు







సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని మూడు కమిషనరేట్లకు కొత్త పోలీసు కమిషనర్‌లను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ఆధారంగా హైదరాబాద్‌కు 60వ కొత్వాల్‌గా కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సైబరాబాద్‌కు తొమ్మిదో బాస్‌గా అవినాష్ మహంతి, రాచకొండకు మూడో కమిషనర్‌గా జి.సుధీర్‌బాబు నియమితులయ్యారు. వీరిలో మహంతి మినహా మిగిలిన ఇద్దరిదీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలే. మహంతిది మాత్రం పోలీసు ఫ్యామిలీ. ఆయా స్థానాల్లో పని చేస్తున్న అధికారుల్లో సందీప్ శాండిల్యను టీఎస్-నాబ్ డైరెక్టర్‌గా బదిలీ చేయగా.. ఎం.స్టీఫెన్ రవీంద్ర, డీఎస్ చౌహాన్‌లను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. కొత్త పోలీసు కమిషనర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇంటి పేరే ఆయన స్వస్థలం..

ముక్కుసూటి అధికారిగా పేరున్న శ్రీనివాస్‌రెడ్డి స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లాలోని కొత్తకోట. ఓయూలో పీజీ, ఆపై ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. అహ్మదాబాద్ ఐఐఎం నుంచి చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్స్ కోర్స్, హంగేరీలో యాంటీ టెర్రరిజం అసిస్టెన్స్ కోర్స్ చేశారు. 1994లో ఐపీఎస్ అధికారిగా పోలీసు విభాగంలో అడుగుపెట్టారు. బోధన్ ఏఎస్పీగా వృత్తి జీవితం ప్రారంభించిన ఆయన నెల్లూరు, మహబూబ్‌నగర్ ఎస్పీగా, ఏసీబీ జేడీగా, హైదరాబాద్ రేంజ్ డీఐజీగా, ఏసీబీ అడిషనల్ డైరెక్టర్‌గా, కోస్టల్ సెక్యూరిటీ ఐజీగా, అదనపు డీజీ ఆపరేషన్స్, ఆర్గనైజేషన్స్‌గా పని చేశారు. మహబూబ్‌నగర్ ఎస్పీగా పని చేస్తుండగా మావోయిస్టులకు సంబంధించిన రాకెట్ లాంచర్లు భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీలో పని చేస్తూ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి ఏపీలో కోస్టల్ సెక్యూరిటీ సిస్టం ప్రవేశపెట్టిన ఘనత కూడా శ్రీనివాస్‌రెడ్డికే దక్కుతుంది. గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌ల్లోనూ ఆయన మార్క్ ఉంది. 2010లో ఐపీఎం, 2019లో పీపీఎం, ఇటీవల అతి ఉత్కృష్ట సేవా పతకం లభించాయి.

సుధీరత్వం.. అన్నింటితోనూ పరిచయం..

రాచకొండ పోలీసు కమిషనర్‌గా నియమితులైన జి.సుధీర్‌బాబుకు శాంతిభద్రతలు, క్రైమ్, ట్రాఫిక్, పరిపాలన.. ఇలా అన్ని అంశాలతోనూ పరిచయం, మంచి పట్టు ఉన్నాయి. ఈయన స్వస్థలం కరీంనగర్ కాగా... ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించారు. డీఎస్పీగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. నాన్-క్యాడర్ ఎస్పీ హోదాలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌కు నేతృత్వం వహించారు. దీని కార్యాలయం గ్రీన్‌లాండ్స్ చౌరస్తాలో ఉండగా 2005 అక్టోబర్‌లో మానవబాంబు దాడి జరిగింది. ఈ కేసు దర్యాప్తు, ఉగ్రవాదుల అరెస్టుల్లో సుధీర్‌బాబు కీలక పాత్ర పోషించారు. 2001లో ఐపీఎస్ ఖరారు కావడంతో ఎస్పీగా మారారు. పలు జిల్లాల్లో విధులు నిర్వర్తించిన ఆయన తన మార్కు చూపించారు. ప్రస్తుతం మల్కాజిగిరిగా మారిన అల్వాల్ జోన్‌కు డీసీపీగా పని చేశారు. డీఐజీ హోదాలో వరంగల్ పోలీసు కమిషనర్‌గా, రాచకొండ సంయుక్త పోలీసు కమిషనర్‌గా, అదనపు సీపీగా విధులు నిర్వర్తించారు. కొన్నాళ్లుగా హైదరాబాద్ ట్రాఫిక్ విభాగానికి నేతృత్వం వహిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్ టు తెలంగాణ వయా ఏపీ..

హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు డీజీపీగా పని చేసి.. ప్రస్తుతం గవర్నర్‌కు శాంతిభద్రతల విభాగం సలహాదారుగా ఉన్న అజిత్ కుమార్ మహంతి కుమారుడే అవినాష్ మహంతి. నగరంలోని విద్యాభ్యాసం పూర్తి చేసిన మహంతి ఇండియన్ రైల్వేస్‌లో పని చేస్తూ 2005లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. క్యాడర్ అలాట్‌మెంట్ నిబంధనలు పక్కాగా అమలు కాకపోవడంతో తొలుత ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు వెళ్లిన ఆయన ఆ రాష్ట్ర గవర్నర్‌కు ఏడీసీగా, దంతేవాడ, బీజాపూర్ జిల్లాకు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. దీనిపై న్యాయ పోరాటం చేసి 2012లో ఉమ్మడి ఏపీ క్యాడర్‌కు వచ్చి.. అప్పట్లో మెదక్ ఎస్పీగా పని చేశారు. ఆపై సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా వచ్చిన ఆయన రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ క్యాడర్‌లోకి మారారు. హైదరాబాద్ సీసీఎస్ డీసీపీగా, సంయుక్త సీపీగా పని చేసి సైబరాబాద్ సంయుక్త సీపీగా వెళ్లారు. అక్కడే ఐజీగా పదోన్నతి పొంది అదనపు సీపీగా పని చేస్తున్నారు. 2018 ఎన్నికల సమయంలో ఈసీ ఆదేశాల మేరకు వికారాబాద్ ఎస్పీగా పని చేసిన, ముక్కుసూటి వ్యక్తిగా పేరున్న మహంతికి మరో అరుదైన రికార్డు కూడా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఈయన మెదక్ ఎస్పీగా పని చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో అక్కడ ఎమ్మెల్యే అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేశారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన అవినాష్ మహంతి డీజే సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేశారు. ఈ పరిణామంతో అప్పటి నుంచి లూప్‌లైన్‌లోనే ఉన్న మహంతికి మళ్లీ అదే కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకమైన సైబరాబాద్ సీపీ పోస్టు ఇవ్వడం పోలీసు చరిత్రలోనే అరుదైన రికార్డు.



పోలీసులకు సూచనలు చేస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శాంతిభద్రతలకు సహకరించాలి

- శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

ఆమనగల్లు: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని శంషాబాద్ డీసీపీ కె.నారాయణరెడ్డి కోరారు. ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ కమాండ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీసులు ప్రజల మధ్య మంచి వాతావరణం ఏర్పడిందని చెప్పారు. తమకు జరిగిన అన్యాయం గురించి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయొచ్చని ఆయన సూచించారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్ పరిధిలో క్రైం రేటు తక్కువగా ఉందని ఇది మంచి వాతావరణాన్ని సూచిస్తోందని అభినందించారు. ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఆమనగల్లులో ప్రస్తుతం ఉన్న పోలీసుస్టేషన్ భవనం స్థలం ఇరుకుగా ఉండటంతో మరో స్థలంలో నిర్మించడానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని అధికారులను కోరినట్టు తెలిపారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్ పనితీరుపై డీసీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ ఎస్‌సీహెచ్ రంగస్వామి, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాం, ఏఎస్ఐలు యాదయ్య, బాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాలు చోరీ

పహాడీషరీఫ్: అమ్మవార్ల పంచలోహ విగ్రహాలను చోరీ చేసిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మామిడిపల్లి గ్రామంలోని పోతరాజు ఆలయ ఆవరణలో లక్ష్మీదేవి, మైసమ్మ, దుర్గా భవానీ అమ్మవార్లకు సంబంధించిన చిన్న ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల్లో ముగ్గురు అమ్మవార్ల పంచలోహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. గుర్తు తెలియని వ్యక్తి గేట్ దూకి ఆలయంలో ఆ విగ్రహాలను చోరీ చేశాడు. సీఐఎస్ఎఫ్ గేట్ ఎదురుగా ఉన్న ఆలయంలో కూడా సోమవారం ఓ యువకుడు గంట చోరీ చేస్తూ పట్టుబడ్డాడు. చిల్లర దొంగ అయిన ఆ యువకుడే ఈ విగ్రహాల చోరీకి పాల్పడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



చోరీకి గురైన అమ్మవార్ల విగ్రహాలు ఇవే..

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కలెక్టర్ భారతి హోళికేరిని మంగళవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌కు వెళ్లిన ఆయన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనేక తప్పులు దొర్లాయని, గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రభుత్వ సత్కారానికి నామినేషన్ల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించినవారిని, ప్రతిభావంతులను ప్రభుత్వం సత్కరిస్తుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రంగాల్లో కనీసం ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం ఆదర్శప్రాయమైన సేవలు అందించిన వారిని తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. సామాజిక, విద్య , వైద్య, సాహిత్య, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వ్యక్తులు, సంస్థల నుంచి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలన్నారు. ఇతర వివరాలకు 040-23391067 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్



షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న దామోదర్

షాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ పేర్కొన్నారు. షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించి, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డాక్టర్ శ్రీనివాస్‌కు సూచించారు. వైద్యులు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

కొందుర్గు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈఓ సుశీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పుష్ప ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్వహిస్తున్న అకడమిక్ బబుల్స్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలలో వర్క్ బుక్‌లు, పాఠ్యపుస్తకాల ప్రణాళికలను అలైన్‌మెంట్ చేసి బోధించాలన్నారు. ఉపాధ్యాయులు పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్ ప్రేమ్‌సాగర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండా వెంకటరంగారెడ్డి జయంతి వేడుకల్లో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

'కొండా' సేవలు చిరస్మరణీయం

చేవెళ్ల: నిజాంకు వ్యతిరేకంగా, తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన నాయకుడు స్వర్గీయ మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకటరంగారెడ్డి అని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో కొండా వెంకటరంగారెడ్డి విగ్రహం వద్ద మంగళవారం ఆయన 133వ జయంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కొండా రాందేవ్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజం ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా పనిచేస్తూనే మహిళలకోసం వారసత్వ హక్కులు సాధించి పెట్టారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం నిజాంకు వ్యతిరేకంగా పోరాటంలో జైలుకు కూడా వెళ్లారని గుర్తు చేశారు. రెవెన్యూ మంత్రిగా ఎన్నో విప్లవాత్మక భూ సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. కౌలుదారుల హక్కుల చట్టాన్ని రూపొందించి, భూమికోసం జరిగినపోరాటాల్లో దున్నే వాడికే భూమి అనే గొప్ప నినాదాన్ని నిజం చేసిన వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి నిలువెత్తు రూపం కొండా వెంకట రంగారెడ్డి అని పేర్కొన్నారు. అలాంటి మహనీయులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. ఆయన చేసే సేవలను గుర్తు చేసుకున్నారు. కొండా వెంకటరంగారెడ్డి ఆశయ సాధనలో భాగంగా ఆయన వారసులుగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డి, కృష్ణ, ప్రతాప్‌రెడ్డి, బీర్ల నర్సింహ, ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బి. చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, అభిలాష్ తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదుకు మరో అవకాశం

సద్వినియోగం చేసుకోవాలంటున్న ఎన్నికల సంఘం

- 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- జనవరి 6న ముసాయిదా జాబితా విడుదల
- ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా వెల్లడి

ప్రస్తుతం ఉన్న ఓటర్లు..

జిల్లా	ఓటర్ల సంఖ్య
హైదరాబాద్	45,36,852
రంగారెడ్డి	35,22,420
మేడ్చల్-మల్కాజిగిరి	28,19,067
మొత్తం	1,08,78,339

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఓటు నమోదు కోసం ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. త్వరలో పంచాయతీ, లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటు నమోదుకు సవరణ చేపట్టింది. రెండు రోజుల క్రితం ప్రక్రియ ప్రారంభం కాగా ఫిబ్రవరిలో తుది జాబితా ప్రకటనతో ముగియనుంది. రాబోయే ఎన్నికల దృష్ట్యా గ్రేటర్ సహా రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో పంచాయతీ, ఏప్రిల్ లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మళ్లీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

షెడ్యూల్ ఇలా..

2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలి. ఫారం 6 ద్వారా నూతన ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జనవరి 6న ముసాయిదా జాబితా, ఫిబ్రవరి 8న తుది జాబితాను వెలువరిస్తారు. ముసాయిదాలో భాగంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు స్వీకరణలకు కూడా అవకాశం ఉంటుంది. అన్ని మండలాలు,పట్టణాలు, పురపాలక సంఘాల్లోని పోలింగ్ కేంద్రాల వారీగా ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశముంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

జనవరి 2024 జనవరి 1 వరకు 18 ఏళ్లు పూర్తయిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దీనికోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తాం. పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌ఓల వద్ద నమోదు చేయాలని సూచించాం.

– విజయేందర్‌రెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

ఉచిత బస్సు.. రాబడి తుస్సు

- మహిళలకు ఆర్టీసీలో ఫ్రీ జర్నీ
- రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య
- డిపోలకు పడిపోతున్న ఆదాయం
- నష్టాల నుంచి గట్టెక్కేదెలాగో..?



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో

ఇబ్రహీంపట్నం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడింది. ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల్లో వయసుతో సంబంధం లేకుండా మహిళలు, ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని శనివారం నుంచి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యనభ్యసించే విద్యార్థినులకు పాసుల రెన్యూవల్, కొత్త బస్‌పాసుల అవసరం లేకుండాపోయింది. డీలక్స్, సూపర్ లగ్జరీ, గరుడ ఏసీ బస్సుల్లో మాత్రం యథావిధిగా టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో 120 బస్సులుండగా అందులో ఆర్డినరీ వంద, మెట్రో బస్సు సర్వీసులు మరో 20 వరకు ఉన్నాయి. నిత్యం 1,200 ట్రిప్పులు, 38 వేల కిలో మీటర్లు ఈ డిపో బస్సులు తిరుగుతుంటాయి. ప్రతి రోజు లక్షన్నర మంది ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. నిత్యం సుమారు రూ.13లక్షల నుంచి రూ.15 లక్షల వరకు డిపోకు ఆదాయం సమకూరుతుంది. అందులో బసు పాసుల ద్వారానే రూ.60 వేల వరకు వచ్చేది. ఇప్పుడు మహిళలకు టికెట్ తీసుకునే అవసరం లేకపోవడంతో ఆర్టీసీ రాబడి గణనీయంగా పడిపోయింది. 20 ఏళ్లుగా నష్టాల్లో ఉన్న ఇబ్రహీంపట్నం డిపో గత సంవత్సరం చివరి నుంచే లాభాల బాట పట్టింది. ప్రస్తుతం ఉచిత ప్రయాణంతో సంస్థ ఆదాయానికి భారీగా గండిపడింది.

రోజుకు రూ.ఏడు లక్షలకు దెబ్బ

గడిచిన మూడు రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఈ లెక్కన రోజుకు ఇబ్రహీంపట్నం డిపో 50 శాతం ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. నిత్యం రూ.13లక్షల నుంచి రూ.15 లక్షల వచ్చే ఆదాయం ఇప్పుడు రూ.7 లక్షలకు పడిపోయింది.

సంఖ్య మరింత పెరిగే అవకాశం

ఉచిత ప్రయాణంతో మహిళల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జీహెచ్ఎంసీ, ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర సంస్థల్లో పనిచేసే మహిళలు, విద్యార్థినులు బసు పాసులు తీసుకొని నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక వివిధ ఫంక్షన్లు, ఏదో పనిపై ఇంట్లో నుంచి వెళ్లే మహిళలకు బస్సు చార్జీలు ఉండకపోవడంతో ఆదాయం మరింతగా పడిపోనుంది. ఇబ్రహీంపట్నం, హైదరాబాద్, మాల్, దండుమైలారం తదితర రూట్లలో రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. ఉచిత ప్రయాణంతో మహిళల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఆయా రూట్లలో తప్పనిసరిగా బస్సుల సంఖ్యను పెంచాల్సిందేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ప్రభుత్వం ఆర్టీసీ నష్టాన్ని ఎలా పూడ్చుతుందో, ఎలా గట్టెక్కిస్తుందో వేచి చూడాలి.

50 శాతం ఆదాయం తగ్గింది



మహిళల ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో డిపోకు 50 శాతం ఆదాయం తగ్గింది. రోజుకు 13లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయలకు పైగా ఆదాయం వచ్చేది. ఇప్పుడు ఏడు లక్షలు మాత్రమే వస్తోంది. మహిళా ప్రయాణికుల సంఖ్య ఇంకా పెరగొచ్చు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది.

– వెంకటనర్సప్ప, డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం

సబ్సిడీ సిలిండర్ వస్తోందని..

- ఏజెన్సీల ఎదుట వినియోగదారుల బారులు
- వంట గ్యాస్‌కు ఈ- కేవైసీ తప్పనిసరి
- గ్రేటర్ పరిధిలో 30 లక్షలకుపైనే కనెక్షన్లు



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఒకటి. ఇందులో భాగంగా సబ్సిడీపై సిలిండర్ సరఫరా జరిగే అవకాశాలు కనిపిస్తుండటంతో వినియోగదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాగా.. కేంద్ర మంత్రిత్వ శాఖ వంటగ్యాస్ కనెక్షన్లకు ఈ-కేవైసీ సమర్పించాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీంతో వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలకు ఉరుకులు పరుగులు ప్రారంభించారు. నాలుగైదురోజులుగా ఆధార్ కార్డులతో ఉదయం నుంచే గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకోని పక్షంలో సబ్సిడీ సిలిండర్ రాదన్న భావన వీరిలో నెలకొంది. దీంతో గ్యాస్ ఏజెన్సీల ఎదుట భారీగా క్యూ కడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు మాత్రం కేవలం ఈ-కేవైసీ పూర్తి కానివారికి మాత్రమే చేస్తున్నామని పేర్కొంటున్నారు.

- గ్రేటర్‌లోని హైదరాబాద్-రంగారెడ్డి- మేడ్చల్ జిల్లా పరిధిలో మొత్తం సుమారు 30 లక్షల వరకు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతిరోజూ 80 వేల వరకు గ్యాస్ రీఫిల్స్ డిమాండ్ ఉండగా, సగటున 60వేల వరకు రీఫిల్స్ సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం ఏడాదికి 12 చొప్పున సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. ముందుగా గృహ వినియోగదారు మార్కెట్ ధర ప్రకారం మొత్తం చెల్లించి రీఫిల్ కొనుగోలు చేస్తుండగా, ఆ తర్వాత సబ్సిడీ సొమ్ము డీబీటీ కింద వినియోగదారుడి బ్యాంక్ ఖాతాలో జమవుతోంది. సబ్సిడీపై పరిమితి ఉండటంతో నగదుపై మొక్కుబడిగా తయారైంది. దీంతో మొత్తం ధర భారం భరించాల్సి వస్తోంది.
- వంటగ్యాస్ సిలిండర్ రూ.500కే ఇవ్వనుండటంతో వినియోగదారులు సిలిండర్ బుకింగ్‌లను ఆపేశారు. ప్రభుత్వ ప్రకటన వచ్చిన తర్వాత బుక్ చేద్దామని వేచి చూస్తున్నారు. సాధారణంగా ప్రతి ఇంట్లో రెండు సిలిండర్లు ఉంటాయి. ఒక సిలిండర్ ఖాళీ కాగానే మరొకటి బుకింగ్ చేసి నిల్వ చేసుకుంటూ ఉంటారు. సాధారణంగా ఒక్కో ఏజెన్సీ కింద భారీగా బుకింగులు జరుగుతాయి. కానీ గత వారం రోజులుగా బుకింగులు మొక్కుబడిగా చేస్తున్నట్లు సమాచారం.

‘వీర్లపల్లి’ విజయం మాదే..

ఎమ్మెల్యే శంకర్‌ను అభినందించిన బాల్యమిత్రులు



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న బాల్యమిత్రులు

నందిగామ: 37 ఏళ్ల క్రితం షాద్‌నగర్ ఎమ్మెల్యేతో కలిసి చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఆయన్ను సన్మానించారు. 1986లో ఎమ్మెల్యే నందిగామ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి పూర్తి చేశారు. కాంగ్రెస్ నుంచి శంకర్‌కు షాద్‌నగర్ టికెట్ రావడంతో ఆయనతో కలిసి చదువుకున్న విద్యార్థులంతా విజయానికి కృషి చేశారు. దీంతో మంగళవారం వారంతా ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానించి తమ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రభుత్వ విద్యార్థులు



విద్యార్థులతో హెచ్‌ఎం విద్యావతి

కేశంపేట: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో ఎంపికైన నందీశ్వర్, శ్రీవాణిని పాఠశాల హెచ్‌ఎం విద్యావతి అభినందించారు. ఈ పోటీలు నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 13 నుంచి 15వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, పీఈటీ యాదయ్య, ఉపాధ్యాయులు ఆనంద్, వీరారెడ్డి, వెంకటప్రసాద్, మహేందర్, రెడ్యాలాల్, అశోక్, పరశురాం అభినందించారు.

కార్యాలయాలకు కాసుల గండం

- నిధులు లేక నిలిచిన పనులు
- యాచారంలో ప్రారంభానికి నోచని ప్రభుత్వ భవనాలు



పనులు నిలిచిపోయిన భవనం

యాచారం: లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ప్రభుత్వ భవనాలను వాడుకలోకి తెద్దామన్న ఆలోచన అధికారులకు గాని, ప్రజాప్రతినిధులకు గాని లేకుండా పోయింది. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రం ఉంది. సాగర్‌రోడ్డు పక్కనే మండల పరిషత్ భవన సముదాయాలు ఉన్నాయి. వీటిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఐకేపీ, వ్యవసాయ, ఈజీఎస్, ఇరిగేషన్ తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొలువుదీరాయి. కానీ కొన్ని భవనాలు నిర్మాణ దశలోనే నిలిచిపోగా, మరికొన్ని భవనాలు నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు ఉపయోగంలో లేక దిష్టి బొమ్మల్లాగా దర్శనమిస్తున్నాయి.

శిథిలావస్థకు..

యాచారం మండల కేంద్రంలో రూ.25 లక్షల జెడ్పీ నిధులతో పదేళ్ల కింద జెడ్పీ అతిథి గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. మూడేళ్లకు నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. కానీ, ఐదేళ్ల గడుస్తున్నా కూడా నేటికి అతిథి గృహం ప్రారంభానికి నోచుకోవడం లేదు. మహానగరానికి దగ్గరలో ఉన్న మండలానికి తరచూ పర్యటనల నిమిత్తం ఉన్నతాధికారులు వస్తుంటారు. ఆ సమయంలో వసతి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. అతిథి గృహం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటుంది. భవనానికి కిటికీలు లేకపోవడంతో పక్షులకు ఆవాసంగా మారింది. గోడలకు రంధ్రాలు పడి విషసర్పాలు లోపలికి పోతున్నాయి. రూ.లక్షలాది నిధులతో కొనుగోలు చేసిన ఫర్నిచర్ నిరుపయోగంగా మారింది. విలువైన సామగ్రి తుప్పు పట్టి పోతుంది.

దిష్టిబొమ్మలా సమావేశ మందిరం

మండల పరిషత్ కార్యాలయంలో ఐదేళ్ల కిందట రూ.25 లక్షల నిధుల ప్రణాళికతో నూతన సమావేశపు హాల్ నిర్మించాలని అధికారులు భావించారు. రూ.15 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేసి స్లాబ్ వరకు నిర్మాణ పనులు చేపట్టి వదిలేశారు. అప్పట్లో 20 గ్రామ పంచాయతీలే ఉండడంతో హాల్ సరిపోయేది. ప్రస్తుతం 24 గ్రామ పంచాయతీలకు పెరగడంతో అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు కూర్చోవడానికి హాల్ సరిపోవడం లేదు. అత్యవసర సమావేశాల్లో కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు బయటనే ఉండాల్సి వస్తుంది.

మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్

ఎంపీడీఓ, తహసీల్దార్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు పనులు నిమిత్తం వందలాది మంది ప్రజలు వస్తుంటారు. వారికి మరుగుదొడ్లు, మూత్రశాల సౌకర్యం లేదు. సర్వసభ్య సమావేశాల్లో వీటిని నిర్మించాలని ప్రజాప్రతినిధులు ఆందోళనలు నిర్వహించినా ఫలితం లేకుండా పోతుంది. తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు వచ్చే రైతులు అత్యవసర సమయాల్లో చెట్లు, వ్యవసాయ భూముల్లో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



ప్రతి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల సమయంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని కోరుతున్నాను. కానీ అధికారుల నుంచి స్పందన లేదు. రిజిస్ట్రేషన్లతో రూ.లక్షలాది ఆదాయం పొందుతున్న రైతులకు సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన లేకపోవడం సరైంది కాదు.

– దంతుక పెద్దయ్య, సర్పంచ్, నానక్‌నగర్

నిధుల కొరత



మండల పరిషత్‌లో సరిపడా నిధులు లేకనే అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయకపోతున్నాం. ప్రభుత్వం నుంచి నాలుగేళ్లుగా నిధులు రావడం లేదు. త్వరలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అతిథి గృహం ప్రారంభించేలా కృషిచేస్తాం. సమావేశపు హాల్‌ను సైతం పూర్తయ్యేలా చూస్తాం.

– కొప్పు సుకన్య, ఎంపీపీ యాచారం

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

- వివాహేతర సంబంధం బయటపడిందని ఉరి వేసుకున్న వైనం
- శంకర్‌పల్లి మండలం బుల్కాపూర్‌లో సంఘటన

శంకర్‌పల్లి /చేవెళ్ల: వివాహేతర సంబంధం బయటపడిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలంలోని బుల్కాపూర్‌కి చెందిన మల్కారం శంకరయ్య(38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం ఆయనకు లలితతో వివాహం జరగగా ఓ కొడుకు, కూతురు ఉన్నారు. వీరి మధ్య గొడవలు తలెత్తడంతో వీడిపోయి వేరుగా ఉంటున్నారు. దీంతో శంకరయ్య లక్ష్మిని రెండో వివాహం చేసుకున్నారు. కొంత కాలానికి ఆయన శంకర్‌పల్లికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్య లక్ష్మిని తరచూ హింసిస్తున్నాడు. కుటుంబ సభ్యులు 15 రోజుల క్రితం పంచాయితీ పెట్టి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన శంకరయ్య సోమవారం రాత్రి సహజీవనం చేసే మహిళ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే ఆయన మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుదలతోనే కల సాకారం

చైతన్య డీమ్డ్ వర్సిటీ వీసీ పురుషోత్తం రెడ్డి



అశ్వినికి డాక్టరేట్ పట్టా అందజేస్తున్న పురుషోత్తం రెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: పట్టుదల, కృషి ఉంటేనే కలను సాకారం చేసుకోగలమని చైతన్య డీమ్డ్ వర్సిటీ వీసీ సీహెచ్.పురుషోత్తం రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ సాత్వికా రెడ్డి అన్నారు. కళశాలకు చెందిన విద్యార్థిని అశ్విని డాక్టరేట్ సాధించడంతో మంగళవారం ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జానారెడ్డిని కలిసిన మేయర్



జానారెడ్డితో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి దంపతులు

బడంగ్‌పేట్: సీఎల్పీ మాజీ నాయకుడు, మాజీ హోంమంత్రి కుందూరు జానారెడ్డి దంపతులను మంగళవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జానారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. వీరి వెంట బాలాపూర్‌కు చెందిన పలువురు నాయకులున్నారు.

వైద్యశాఖ మంత్రికి సన్మానం

శంషాబాద్: రాష్ట్ర వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ సన్మానించారు. ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. వైద్యశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శంషాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని కోరారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ ప్రారంభం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అఖిల భారత సకోేరుకాల చీడల యాజమాన్యం ఆధ్వర్యంలో నేషనల బీ కీపింగ్ మరియు హానీ మిషన్లో భాగంగా ఆసక్తి గల యువ రైతులకు తేనెటీగల శిక్షణ ను ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమాని రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ తేనెటీగల ప్రాత వాటి సంరక్షణ పై వివరిస్తూ తేనెటీగల పెంపకాన్ని వ్యాపార దృక్పధంతో చేసుకోవడం వల్ల మంచి లాభాలు పొందవచ్చన్నారు. యూనివర్సిటి హెడ్ కీటక విభాగం అధినేత యస్.జె. రహేమాన్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు తేనెటీగాల పెంపకం చేపట్టి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీర్‌కుమార్, డాక్టర్ సునీత, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చినయువ రైతులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఆర్‌డీఓ కృష్ణన్

దోమ: ధాన్యం కొనుగోళ్లల్లో అధికారులు నిర్లక్ష్యానికి పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ కృష్ణన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పాలేపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమస్యలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు తప్పకుండా ప్రతీ రైతు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం తేమ శాతం పరిశీలించి ప్రభుత్వ మద్దతు ధర కల్పించాలన్నారు. గన్నీ సంచులు, టార్పలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సురేశ్, సీసీలు సుజ్ఞాని, రైతులు పాల్గొన్నారు.

అధికారుల అభినందనలు



ఎమ్మెల్యే బీఎంఆర్‌తో ఎస్సైలు

తాండూరు టౌన్: తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి నియోజకవర్గ పరిధిలోని అధికారులు అభినందనతలు తెలిపారు. మంగళవారం ఆయకు పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తాండూరు ఏడీ జాకబ్, టౌన్ ఎస్సై అబ్దుల్ రవూఫ్, యాలాల ఎస్సై అరవింద్, బషీరాబాద్ ఎస్సై వేణుగోపాల్ గౌడ్, తాండూరు ఎస్సై మధుసూదన్ రెడ్డి, పెద్దేముల్ ఎస్సై కాశీనాథ్ ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన తులేకలాన్ కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తులేకలాన్ గ్రామాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మండలంలోని తులేకలాన్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కలిశారు. శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. అన్ని గ్రామాలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పాండు, శశాంక్‌రెడ్డి, సుదర్శన్, నారన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శశివర్ణ, జంగయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కన్నారెడ్డి, వెంకటేష్, పాండు, ప్రభు, శ్రీకాంత్, లింగం, జంగయ్య పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై వివరణ ఇవ్వండి

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రధాన చెరువుల ఆక్రమణపై తదుపరి విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని కలెక్టర్లు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. చెరువు నీటి నిల్వ పూర్తి సామర్థ్యం, సరిహద్దులు నిర్ణయించి రాళ్లు ఏర్పాటు చేయాలని పదేళ్ల కిందట ఆదేశాలిచ్చినా ఇంకా అమలు చేయకపోవడంపై అసహనం వ్యక్తంచేసింది. ఉమ్మడిగా సర్వే చేసి స్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించినా.. ఇప్పటివరకు ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలంటూ విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని దుర్గంచెరువు, సున్నం చెరువు, ఫిర్జాదీగూడ పెద్ద చెరువు, చిన్న దామర చెరువు, చిన్న రాయుని చెరువు, నల్ల చెరువు.. ఇలా పలు చెరువులను ఆక్రమించి ఆక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మాదాపూర్‌కు చెందిన అనిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించింది.

పేరుకే నిర్మాణం.. చూస్తే అధ్వానం!

- తూతూమంత్రంగా క్రీడా ప్రాంగణాలు
- పాఠశాల ఆవరణల్లోనే ఏర్పాట్లు



మాచన్‌పల్లిలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. షాబాద్ మండల వ్యాప్తంగా పేరుకు మాత్రమే నిర్మించారని.. నిధులు వృథా చేశారని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలాచోట్ల స్థల సేకరణ కూడా సరిగా చేయలేదు. కొన్నిచోట్ల కొత్త స్థలాలను వెతకడంలో విఫలమై తూతూమంత్రంగా పాఠశాలల ఆవరణల్లోనే క్రీడా ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. సాధారణంగా గ్రామాల్లో కొత్తగా స్థలాల పరిశీలన చేసి ప్లేగ్రౌండ్‌ను ఏర్పాటు చేసి క్రీడల కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. అందుకోసం జాతీయ గ్రామీణ ఉపాధి నిధులను వినియోగించాలి. ఒక్కో గ్రామంలో రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు అవసరాన్ని బట్టి నిధులను ఉపయోగించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలి. కానీ వీటిని ఆగమేఘాల మీద పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో సర్పంచ్‌లు ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టారు. అయితే ఇప్పటికీ కొన్నిచోట్ల చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని పలువురు వాపోతున్నారు.

పాఠశాలల్లోనే ఏర్పాటు..

మండల పరిధిలోని 41 గ్రామ పంచాయతీల్లో ప్రతి గ్రామంలో 20 గుంటల్లో నూతనంగా ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాల్సింది. కొన్ని చోట్ల క్రీడాస్థలాలు ఉన్న పాఠశాలల్లోనే బోర్డులు పాతి చేతులు దులుపుకొన్నారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో వినియోగించాల్సిన నిధులు ఆయాచోట్ల వృథా కావడంతో లక్ష్యం పక్కదారి పట్టిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, నిర్వహణ విషయంలో సరైన విధానాలు అవలంబించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక స్థలాలు ఉండాలి



ప్రభుత్వం విద్యార్థులు, యువత కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాలు ప్రత్యేక స్థలాల్లో ఏర్పాటు చేయాలి. కానీ కొన్నిచోట్ల పాఠశాలల ఆవరణల్లోనే ప్రాంగణాలను ఏర్పాటు చేసి నిధులు దుర్వినియోగం చేశారు. దీంతో ప్రజాప్రతినిధులకు లాభం తప్ప యువతకు విద్యార్థులకు ఒరిగింది ఏమీలేదు.

– కిరణ్, బీజేపీ మండల అధ్యక్షుడు, షాబాద్

ఉన్నతాధికారులకు విన్నవించాం



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఏర్పాటు చేయడంతో సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకువచ్చి పనులు చేయించాం. స్థలాలు లేని గ్రామాల్లో మాత్రమే పాఠశాలల్లో సరిపడా నిధులు ఉపయోగించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కొన్నింటిలో ఉన్న సమస్యలు, బిల్లులు రాని విషయం తదితరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– అనురాధ, ఎంపీడీఓ, షాబాద్